ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం జిల్లా వార్తలు
6
సోమవారం 3 ఫిబ్రవరి 2025



- పెంచికలపేటరేంజ్‌లో బర్డ్ వాక్ ఫెస్టివల్
- అటవీ ప్రాంతాల్లో జంగిల్ సఫారీ
- సుమారు 50 రకాల దేశీ, విదేశీ వలస పక్షుల సందడి
- పాల్గొన్న 50 మంది ఔత్సాహిక పక్షి ప్రేమికులు

# పక్షుల విహారం.. ప్రకృతి పరవశం





పక్షుల కిల..కిల.. రావాలతో పెంచికలపేట అటవీప్రాంతం కళకళలాడుతోంది. రంగురంగుల ఈకలు.. చూడచక్కని ముక్కులతో.. కొమ్మరెమ్మలపై ఎగురుతూ.. నింగిలో ఆహ్లాదకరమైన విన్యాసాలు చేస్తూ పక్షి ప్రేమికుల మనస్సు పరవశింపజేస్తున్నాయి.



పక్షి ప్రేమికులు కెమెరాల్లో బంధించిన వివిధ రకాల పక్షులు





పక్షుల ఫొటోలు తీస్తున్న దహెగాం తహసీల్దార్ కవిత

పెంచికలపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట రేంజ్‌లో ఆసిఫాబాద్ అటవీశాఖ ఆధ్వర్యంలో చిత్తడినేలల దినోత్స వాన్ని పురస్కరించుకుని నిర్వ హించిన బర్డ్ వాక్ ఫెస్టివల్, నేచర్ ట్రయల్ పక్షి ప్రేమికులను పరవశింప చేసింది. అటవీశాఖ ఆధ్వ ర్యంలో నిర్వహించిన బర్డ్‌వాక్ ఫెసివల్ నేచర్ ట్రైయల్‌లో పాల్గొనేందుకు 50మంది ఔత్సాహిక ప్రకృతి ప్రేమికులు శనివారం సాయంత్రం పెంచికల పేటకు చేరుకున్నారు. అక్కడ నుంచి రాత్రి గుండెపల్లి అటవీశాఖ బేస్ క్యాంపు చేరుకుని నైట్ ఫైర్ క్యాంప్, బోన్ ఐర్‌ను ఆస్వాదించారు. ఆదివారం ఉదయం ఎఫ్‌డీవో బోబడే సుశాంత్ సుకుదేవ్ బర్డ్‌వాక్ ఫెస్టివ ల్‌ను ప్రారంభించారు. ముం దుగా ఎల్లూరు బొక్కి వాగు ప్రాజెక్టు వద్ద పక్షులను వీక్షించారు. ఈ ప్రాంతంలో సుమారు 50రకాల దేశీ, విదేశీ పక్షులను గుర్తించి తమ తమ కెమెరాలో బంధించారు. పక్షి ప్రేమికులకు ఎఫ్ఎస్‌వో జగన్మోహన్‌గౌడ్, వైల్డ్ ఫొటో గ్రాఫర్ రాజేష్ పక్షుల జీవన శైలి, ప్రాముఖ్యతను వివరించారు.

### ● రాబందుల ఆవాసమైన..

మధ్యాహ్నం బొక్కివాగు ప్రాజెక్టు నుంచి 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న రాబందుల ఆవాసమైన పాలరాపుగుట్ట వద్దకు సఫారీ వాహనాల్లో చేరుకు న్నారు. ప్రాణహిత పెద్దవాగు సంగమ ప్రాంతాన్ని సందర్శించారు. రాబందులను చూద్దా మని వచ్చిన ఔత్సాహికులకు ఈ సారి కూడా నిరాశే ఎదురైంది. తిరుగు ప్రయాణంలో గుండెపల్లి, కమ్మర్‌గాం, నంది గామ తదితర ప్రాంతాల మీదుగా జంగల్ సఫారీ సాగింది. సుమారు 50 రకాల పక్షుల కోలాహలం బర్డ్‌వాక్ ఫెస్టివల్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇందులో ఐదురకాల విదేశీ పక్షులు, 40 రకాలపైగా వలస పక్షి జాతులు ఉన్నాయి. ఇందులో బార్ హెడ్డడ్‌గైస్, గ్రీలాగ్‌గూస్, రెడ్ క్రెస్టెడ్ పోచర్డ్, గాడ్ వాల్ డక్స్, నార్తర్న్ షావ్లర్స్, బ్లాక్ డ్రాగన్లో, యురేషాన్ స్పూన్ బిల్, వైట్ త్రటేడ్ కింగ్ ఫిషర్, కామన్ హోప్, రివర్ టర్న్, గ్రే హార్న్ బిల్, నార్తర్న్ పిన్టెయిల్, స్పాట్ బిల్ డక్స్, బ్లాక్ వింజర్డ్ స్టిల్ట్, రెడ్ వాటర్ లాప్వింగ్, గ్రేన్ బి ఈటర్, ఓపెన్ బిల్డ్ స్టార్క్ తదితర పక్షులు ఔత్సాహికులను ఆనందింపజేశాయి.



అటవీ ప్రాంతాల్లో రాత్రి సమయంలో బస చేసిన ఔత్సాహికులు

### మరిచి పోలేని అనుభూతి..



ఈ బర్డ్‌వాక్ ఫెస్టివల్ మరిచి పోలేని అనుభూతిని పంచింది. ఇన్ని రకాల పక్షులు ఈ ప్రాంతంలో ఉంటాయని అనుకోలేదు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాం. మేము అనుకున్న దానికంటే ఈ ట్రిప్ మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ కార్యక్రమం ఎప్పుడు నిర్వహించినా మళ్లీ పాల్గొనాలనే ఆసక్తి కలిగింది.

- డి కవిత, దహెగాం తహసీల్దార్

### ఆస్ట్రేలియా నుంచి వచ్చాం..



అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్స్ వాక్ ఫెస్టివల్ గురించి తెలుసుకొని ఆస్ట్రేలి యా నుంచి వచ్చాం. ఇక్కడ అడవులు, పక్షులు ఈ ప్రాంతం ఎంతగానో బాగున్నాయి. ఇంత దూరం ప్రయాణించి వచ్చినందుకు సంతృప్తి కలిగింది. అటవీశాఖ అధికారుల సహకారం సైతం అభినందనీయం.

- జుహి హైమద్, మనోజ్ఞరెడ్డి, ఆస్ట్రేలియా

## బడ్జెట్‌లో కార్మిక వర్గానికి అన్యాయం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు ఉపేందర్

రెబ్బెన, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో కార్మిక వర్గానికి అన్యాయం చేశారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సయ్య అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక వర్గానికి ఎంత మేర నిధులు కేటాయిస్తారన్నది పేర్కొనలేదన్నారు. అలాగే కూలీ రేట్లు పెంచే విషయం కూడా ప్రస్తావించలేదన్నారు. రైతుల మద్దతు ధర కోసం కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కేవలం అంకెల గారడి చేశారని తలెఇపారు. సమావేశంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ సిబ్బంది శ్రమదానం



శ్రమదానంలో పాల్గొన్న విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో ఆదివారం విద్యుత్ అకౌంట్స్ అధికారి పి రాజమల్లు ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో జూనియర్ అకౌంట్స్ అధికారి రమేష్, సీనియర్ అసిస్టెంట్ పి.వెంకటేష్, తిరుపతి, స్టాఫ్ రవీందర్, సంపత్, శేఖర్, జార్జ్, రంజిత్, లత పాల్గొన్నారు.

## పక్కా ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు పక్కా ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలని మోటివేషనల్ స్పీకర్ జయసింహ తెలిపారు. స్థానిక కృష్ణవేణి పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వార్షిక పరీక్షలకు ప్రణాళికాబద్ధగా చదువాలన్నారు. సమయాన్ని వృధా చేయకుండా ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని చెప్పారు. జీరోల నుంచి హీరోలుగా ఎదిగిన వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విజయం సాధించడం లో ఉన్న ఆనందం మరెక్కడా దొరకదన్న విషమం గమనించాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్ సురవర్ధన్, డైరెక్టర్ జియా ఉల్ హక్, డైరెక్టర్ వేద ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లయన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం నజ్రూల్‌నగర్‌లోని వేదమందిర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. నిరుపేదలకు సేవలు అందించేందుకు లయన్స్ క్లబ్ ప్రత్యేకంగా శిబిరాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో ప్రోగ్రాం చైర్మన్ కాళిదాస్ మండల్, డైరెక్టర్ హరిదాస్ సర్దార్, ఠాగూర్‌రాయ్, బిశ్వాస్, అభీంద్రనాథ్ మండల్, మహానంద మండల్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హోమం

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బాలేశ్వరస్వామి ఆలయంలో గత నెల 30న ప్రారంభమైన నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం నాల్గవ రోజు అర్చకులు శ్రీధర్ ఆధ్వర్యంలో హోమ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు అజయ్, విజయ్ కుమార్ శర్మ, బాలేశ్వర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గోండి భాష దినోత్సవం

బెజ్జూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివారం గోండి భాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాయిసెంటర్ సర్‌మేడి శంకర్ మాట్లాడు తూ పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తి గోండి భాష అన్నారు. గోండి భాష అభివృ ద్ధి కోసం మోతి రాం, రావన్ కంగాలి లాం టి మహాత్ములు కృషి చేశారని కొనియాడా రు. కార్యక్రమంలో సర్‌మేడిలు శంకర్, బక్కయ్య, శంకర్, సకారాం, పుల్ల య్య, సతీష్, గంగారాం, ప్రశాంత్, వెంక టేష్, తుకారాం, శంకర్, శ్యాంరావు, అమృత, పద్మ, శ్రీదేవి, రోజ, లక్ష్మి, సుజాత, శారద, గంగుబాయి, పార్వతి పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

లింగాపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగిన అవినాష్ అనే వ్యక్తి చికిత్స పొందు తూ ఆదివారం మృతి చెందాడు. లింగాపూర్ ఏఎస్సై గంగారాం తెలిపిన వివరాల ప్రకారం.. వంజరిగూడా గ్రామానికి చేందిన అవినాష్ (19) అనే వ్యక్తి రెండేళ్ల క్రితం చదువు మానివేశాడు. అప్పటి నుంచి ఏ పనీ చేయడం లేదు. దీంతో తండ్రి హనుమంతు పని చేయాలని మందలించాడు. దీంతో శుక్రవారం పురుగల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే జైనూర్ ఆప్పత్రికి తరలించారు పరిస్థితి విషమించడంతో వైదుల సూచన మేరకు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

## 'ప్రజావాణి' రద్దు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శాసన మండలి ఎన్నికల దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమ నించి ప్రజలు సహకరించాలని కోరారు.

# మాదిగలు ఐక్యత చాటాలి





రెబ్బెనలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రెబ్బెన, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో 7వ తేదీన నిర్వహించే లక్ష డప్పులు, వేయి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా మాదిగల ఐక్యత చాటాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు మాదిగ పిలుపునిచ్చారు. రెబ్బెన మండలంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపల్లి ప్రభాకర్ మాట్లాడారు. హైదరాబాద్‌లో 7వ తేదీన నిర్వహించే లక్ష డప్పులు, వేయి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మాదిగలు ఐక్యంగా ఉండేందుకు కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, శ్రీకాంత్, రాజేష్, వెంకటి, రమేష్, రాజేష్, స్వామి, పర్వతాలు, నర్సింహులు, రవి కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్‌లో ఈ నెల 7న తలపెట్టిన లక్ష డప్పులు, వేయి గొంతుల పోస్టర్లను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య ఆదివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. పెద్ద సంఖ్యలో మాది గలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి, పురుషోత్తం, శ్రీనివాస్, శేఖ‌ర, ఇస్తారి, సురేష్, మహేష్, రంగయ్య, సంజీవ్, రాజేష్, మహేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటకరంగ అభివృద్ధికి కృషి

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అదనపు ప్రాజెక్టు అధికారి రామకృష్ణ అన్నారు. ఆదివారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అడ ప్రాజెక్టు వద్ద నిర్మించిన లేక్ వ్యూ రెస్టారెంట్‌ను జేడీఎం నాగభూషణం, ఆసిఫాబాద్ వెలుగు మహిళా మండి సమాఖ్య ప్రతినిదులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ లేక్ వ్యూ రెస్టారెంట్ పరిధిలో ఆసిఫాబాద్ వెలుగు మహిళా మండల సమాఖ్య ద్వారా వీఓఏ భీమన్న ద్వారా ఐదుగురు మహిళలతో జాయింట్ లయ బులిట్ గ్రూప్ ఏర్పాటు చేసి ప్రయాణికులు, పర్యాటకులకు వివిధ రకాల స్నాక్స్, టీ అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఆశలు

- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపు
- కొత్త దరఖాస్తులపై ఆందోళన



సర్వే తీరు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, మున్సిపల్ అధికారులు(ఫైల్)

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం లబ్ధిదారులు ఆశగా వేచి చూస్తున్నారు. గత నెల 31 వరకు ఇందిరమ్మ ఇళ్ల అర్హుల కోసం సర్వే నిర్వహించారు. అలాగే మిగిలిన పథకాలకు కూడా అధికారులు సిబ్బంది క్షేత్ర స్థాయి సర్వేలు చేపట్టారు. అర్హుల జాబితాలను తయారు చేసి నివేదికలు పంపిచారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాదర్ మున్సిపాలిటీలతో పాటు పాటు 15 మండలాల ప్రజలు సంక్షేమ పథకాల కోసం ఆశతో ఎదురు చూస్తున్నారు. ఆసిఫాబాద్‌లో రేషన్ కార్డులకు 911, ఇందిరమ్మ ఇళ్లకు 2,342, ఆత్మీయ భరోసాకు 539, రైతు భరోసాకు 14 దరఖాస్తులు వచ్చాయి. కాగజ్‌నగర్‌లో రేషన్ కార్డులకు 2,520, ఇందిరమ్మ ఇళ్లకు 8,962 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు.

కాగా కాగజ్‌నగర్ పట్టణంలోని 30 వార్డుల్లో 7,899 అర్హు లకు గానూ ఇందిరమ్మ ఇళ్ల సర్వే గత నెల పూర్తయ్యింది. అనంతరం నిర్వహించిన వార్డు సభల్లో మరో 1,063 మంది కొత్తగా దరఖాస్తులు చెసుకు న్నట్లు అధికారులు ప్రకటించారు. దీనికి సంబంధించిన గ్రామసభల్లో అభ్యంతరాలు, తుది జాబితాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియలో నియోజ కవర్గానికి 3,500 మంజూరు ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఒక్కో వార్డుకు ఎన్ని ఇస్తారు, మిగిలిన వారికి ఎలా సర్దుబాటు చేస్తారోననే సందేహాలు న్నాయి. మరో వైపు పదేళ్ల అనంతరం రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించడంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. జనవరి 26న రాష్ట్రంలోని ప్రతీ మండలంలో ఒక్కో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకుని లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్ అందజేశారు. కాగా మిగితా గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఎప్పుడు అందజేస్తారని ప్రభుత్వ నిర్ణయం తీసుకోసం లబ్ధిదారులు వేచి చూస్తున్నారు.

# ఎక్కడి చెత్త అక్కడే

● పారిశుధ్యం అధ్వానం ● ఏ వీధికెళ్లినా దుర్గంధమే ● వ్యాధుల భయంతో ప్రజల వణుకు



గుండిరోడ్డులో పేరుకుపోయిన చెత్త



చెక్‌పోస్టు కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నది. నెలల తరబడి చెత్త తొలగడం లేదు. ఏ వీధి చూసినా, ఏ డ్రైనేజీ చూసినా దుర్గంధంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల పారిశుధ్యం అధ్వానంగా మారింది. చాలా చోట్ల వీధి దీపాలు వెలగడంలేదు. కొన్ని గ్రామాల్లో తాగు నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. జిల్లా కేంద్రంలోని రాజంపేట గ్రామ పంచాయతీలోని రాజంపేట, చెక్‌పోస్టు కాలనీ, న్యూరాజంపేట, గుండిరోడ్డుల లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. గత కొన్ని నెలలుగా చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురి కి కాలువ అస్తవ్యస్తంగా ఉండటంతో చెక్‌పోస్టు కాలనీ లో ఇళ్ల మధ్యనే మురికి నీరు నిలిచి పోయింది. దీంతో కాలనీవాసులు వ్యాధుల భయంతో వణికిపోతున్నారు. సంబంధిత అధికారులకు కాలనీవాసులు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. మండలంలోని అయా గ్రామాల్లోనూ పారిశుధ్యం అధ్వానంగా మారింది. ప్రధాన వీధులలో ఎక్కడికక్కడా చెత్తకుప్పలు కన్పిస్తున్నాయి. రోజుల తరబడి చెత్తను తొలగించక పోవడంతో తీవ్రమైన కంపు కొడుతోంది. కాలువలు సక్రమంగా లేని కాలనీల్లో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. ఆయా గ్రామపంచాయతీలో మురికి కాలువలు శుభ్రం చేయక పోవడంతో దుర్వాసనతో ప్రజలు భరించలేక పోతున్నారు. దోమల బెడద ఉన్నా వాటి నివారణకు ఫాగింగ్ చేయడంలేదు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### మురుగు నీటితో ఇబ్బందులు..



కాలనీలో మురుగునీరు పేరుకుపోయి దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మురికి కాలువ సక్రమంగా లేక పోవడంతో నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. నెలల తరబడి ము రికి నీరు రోడ్డుపైనే ఉన్నా అధికా రులు పట్టించుకోవడం లేదు.

- రేఖ, చెక్‌పోస్టుకాలనీ

### జ్వరాల బారిన పడుతున్నాం..



చెత్తాచెదారం ఎక్కడికక్కడే ఉండడంతో దోమలు పెరిగిపోయి జ్వరగా బారిన పడుతున్నాం. మురికి కాలు వలు సక్రమంగా లేవని అధికారులకు తెలిపినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- లక్ష్మి, చెక్‌పోస్టుకాలనీ

## వందశాతం ఫలితాలు సాధించేందుకు కృషి

● ప్రభాకర్, కాగజ్‌నగర్ ఎంఈవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ఆంధ్రజ్యోతి:** పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**ఎంఈవో:** పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుం టున్నాం.ప్రస్తుతం పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి రోజూ సాయంత్రం అదనపు తరగతులు నిరహిస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** బడిబయట ఉన్న విద్యార్థుల గుర్తింపునకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

**ఎంఈవో:** విద్యార్థుల డ్రాప్ ఔట్స్ గురించి బడి బాట కార్యక్రమం చేపట్టాం. విద్యార్థులు ఇంటి వద్ద ఉండకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. డ్రాప్ ఔట్స్ లేకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నాం.

**ఆంధ్రజ్యోతి:** విద్యార్థుల ఆన్‌లైన్ ఎన్‌రోల్ కార్యక్రమం పూర్తయిందా?

**ఎంఈవో:** ప్రతీ పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అందరికి సూచించాం. దాదాపు ఈ ప్రక్రియ పూర్తి కావస్తోంది. పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- కాగజ్‌నగర్ టౌన్, (ఆంధ్రజ్యోతి)

## రాంజీ సత్పాల్‌కు ఘన నివాళి

వాంకిడి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ తండ్రి రాంజీ సత్పాల్ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హంసరాజ్, విలాస్, రాజేంద్రప్రసాద్, రోషన్, విజయ్, రాకేష్, ఇంద్రజిత్, ప్రతాప్, మనోజ్ పాల్గొన్నారు.

# అలంకార ప్రాయంగా క్రీడా ప్రాంగణాలు



అక్కరకు రాని ఆట వస్తువులు

● నీరుగారుతున్న లక్ష్యం... నిరుపయోగంగా మైదానాలు
● పట్టించుకోని అధికారులు... ప్రజాధనం వృధా

కాసిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం పంచాయతీల వారీగా తెలంగాణ క్రీడ ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ అధికారుల అలసత్వం పర్యవేక్షణ లోపంతో నేడు క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. మంచిర్యాల జిల్లాలో 311 గ్రామపంచాయతీలు ఉండగా పంచాయతీకి ఒకటి చొప్పున క్రీడా ప్రాంగణాలను నిర్మించారు. అలాగే మేజర్ పంచాయతీల్లో రెండు క్రీడా ప్రాంగణాలను నిర్మించారు. ఈ లెక్కన జిల్లాలో 450కి పైగా క్రీడా ప్రాంగణాలను లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించారు. ప్రతిష్టాత్మకంగా నిర్మించిన క్రీడా ప్రాంగణాలు ఆశించిన లక్ష్యానికి చేరుకోలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. ముళ్ల పొదలతో నిండిపోయి రహదారి సౌకర్యం లేక ప్రాంగణాల్లో నేడు అసాంఘీక కార్యకలాపాలతో పాటు మందు బాబులకు అడ్డాగా మారాయి. యువ క్రీడాకారులను ప్రోత్సహించి ఆటల వైపు దృష్టి మళ్లించేందుకు క్రీడా సామాగ్రిని యువజన సంఘాలకు క్రీడా పరికరాలు అందించారు. అవి నాసిరకంగా ఉండడంతో మూడు నెలలకే విరిగి మూలన పడ్డాయి. ఆట వస్తువులన్నీ అక్కరకు రాకుండా పోయాయి. యువత దిశ నిర్దేశం లేక అల్లర చిల్లరగా తిరుగుతూ మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాలను బుగ్గి పాలు చేసుకుంటున్నారు. మైదానాల్లో ఆటలు ఆడే క్రీడలను మర్చిపోయి సెల్‌ఫోన్‌లలో గేమ్‌లు ఆడుతూ వాటికి బానిసలవుతున్నారని సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ధర్మారావుపేటలో ముళ్ల పొదలతో నిండిపోయిన తెలంగాణ క్రీడా ప్రాంగణం

### ● మొక్కుబడిగా

జిల్లాలో 450కి పైగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినప్పటికీ పల్లెల్లో ఎక్కడ క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగానే మిగిలిపోయాయి. స్థలం కేటాయింపులో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూముల కోసం గాలించి ఎక్కువ శాతం మైదానాలను అటవీ శివారు ప్రాంతాలకే పరిమిత చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్మాణ బాధ్యతలను స్థానిక సర్పంచులకు అప్పగించారు. కొందరు సర్పంచులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మిస్తే మరికొందరు మొక్కుబడిగా నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. క్రీడా ప్రాంగణాలు ఊరికి దూరంగా ఉండడం ఒక కారణమైతే రహదారి సౌకర్యం లేక యువకులు క్రీడా ప్రాంగణాలకు వెళ్లడం లేదు. అలాగే రెవెన్యూ అధికారులు స్థలం కేటాయిస్తే ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో సర్పంచులు నిర్మాణ పనులను చేపట్టారు. ఆయా శాఖల మధ్య కొరవడిన సమన్వయంతో పర్యవేక్షణ కుంటు పడింది. యువకులను క్రీడల వైపు మళ్లించి శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కోసం ఓపెన్ జిమ్‌లను సైతం అందుబాటులోకి తెస్తామని చెప్పారు కానీ ఇవి కొన్ని పంచాయతీలకు మాత్రమే పరిమితం అయ్యాయి. దీంతో ఆశించిన లక్ష్యం నీరుగారిపోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలని యువకులు , ప్రజలు కోరుతున్నారు.

### ప్రాక్టీస్‌చేసేందుకు సరైన మైదానాలు లేవు



ఫుట్‌బాల్ అంటే నాకు చాల ఇష్టం. కానీ రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసేందుకు క్రీడా మైదానాలు లేవు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను నిర్మించింది. కానీ ఉపయోగంలోకి రాకపోవడంతో నిరుపయో గమైంది.

ఎక్కడ కూడా క్రీడా ప్రాంగణాలు సరిగ్గా లేకపోవడంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. క్రీడా ప్రాంగణాల్లో సౌకర్యాలు కల్పించి అందుబాటులోకి తెస్తే నాలాంటి పేద క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతుంది.

-సోలంకి సంతోష్, సోమగూడెం

### సర్పంచులను అప్పుల పాలు చేసింది



తెలంగాణ క్రీడా ప్రాంగణాల నిర్మాణాలు సర్పంచులను తీరని అప్పులు పాలు చేశాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో సోమగూడెం(కే)లో క్రీడా ప్రాంగణం నిర్మించి రూ. 2.80 లక్షలు అప్పుల పాలయ్యాను. గత ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాలను నిర్మించాలని సర్పంచులపై తీవ్రంగా ఒత్తిడి చేసింది. నిర్మించకుంటే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని చెప్పింది. దీంతో సర్పంచులు అప్పులు చేసి క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తే ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు.

-సాపాట్ శంకర్, మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు

### క్రీడా ప్రాంగణాల పర్యవేక్షణ స్థానిక సంస్థలకే అప్పగిస్తాం



తెలంగాణ క్రీడా ప్రాంగణాల నిర్మాణాలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా నిర్మించినప్పటికీ వాటి నిర్వహణను స్థానిక సంస్థలకే అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని తెలంగాణ క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తెచ్చి క్రీడాకారులకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడుతున్నాం. క్రీడా ప్రాంగణాలు దుర్వినియోగం కాకుండా చర్యలు చేపడుతున్నాం. పంచాయతీరాజ్ శాఖను అనుసంధానం చేసుకుని క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తాం.

- కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈసుగాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రెండు సెల్ ఫోన్లను సంబంధికులకు ఆదివారం అందజేశారు. ఈసుగాం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏఎస్సై హీరామన్ మాట్లాడారు. సెల్ ఫోన్ విషయంలో అంతా జాగ్రత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నయీం తదితరులు పాల్గొన్నారు.

## ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని పరీక్షల సీఎస్ ఆసీఫ్ అహ్మద్ అన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ జనరల్, వొకేషనల్ విభాగాల్లో మొత్తం 256 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు.. ఈ పరీక్షల కోసం ఐదు గదులను కేటాయించామని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 130 మంది పరీక్షకు హాజరవుతారని చెప్పారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 126 మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు. కళాశాలలో ల్యాబ్ కోసం సరిపడా గదులు లేకపోవడంతో తరగతి గదులను వినియోగిస్తున్నామని అన్నారు. ఈ కళాశాల ల్యాబ్ కోసం అదనపు గదులు నిర్మిస్తే ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడు నల్ల టీ షర్టు ధరించి ఉన్నాడని, తెలిపారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే తమకు తెలియజేయాలని జీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ సురేష్ కోరారు.

## జిల్లాకు పెరిగిన పులుల వలసలు

- సుస్థిర ఆవాసాల కోసం గాలింపు
- సంరక్షణ చర్యలు చేపడుతున్న అటవీ అధికారులు



అటవీ శివారులో లభించిన పెద్దపులి పాదముద్ర

కాసిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా మంచిర్యాల జిల్లాకు పులుల వలసలు పెరిగిపోయాయి. మహారాష్ట్ర నుంచి అతిథులుగా వచ్చి వెళ్తున్న పెద్ద పులుల సంరక్షణకు అటవీ శాఖ అధికారులు పటిష్ట భద్రత చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ సుస్థిర ఆవాసం లేక వచ్చిన దారినే తిరిగి పక్క జిల్లాలకు పయనమవుతున్నా యి. గత ఏడాది సెప్టెంబరులో ఎస్ 12 పులి మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట, మంచిర్యాల, దేవాపూర్ అటవీ రేంజ్‌పరిధిలో నెల రోజులుగా విడిది చేసింది. కానీ ఎక్కువ రోజులు ఉండలేక వెళ్లిపోయింది. ఇప్పుడు జగిత్యాల జిల్లా కొడిమ్యాల అటవీ శివారు ప్రాంతంలో తిరుగుతున్నట్లు సమాచారం. అలాగే ఇప్పుడు బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలో బీ 1 పులి నాలుగు రోజులుగా సమీప గ్రామాల ప్రజలను, అటవీ అధికారుల ను హడలెత్తిస్తోంది. మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లాలో ప్రవేశించి ఇటీవలే మంచిర్యాల జిల్లాలోకి ఎంట్రీ ఇచ్చింది. అటవీ శివారు ప్రాంత గ్రామాల ప్రజ లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. అటవీ అధికారులు ఇప్పటికే ప్రజలను అ ప్రమత్తం చేసి ప్రజలకు అవగాహన కర్యాక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉచ్చులు, ఉరు లు, విద్యుత్ తీగలు అమర్చి పులికి హానీ తలపెట్టవద్దని హెచ్చరికలు జారీ చేశారు. అ టవీ శాఖ సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి పులి సంరక్షణ కోసం శ్రమిస్తున్నారు. బీ 1 పెద్దపులి నాలుగు రోజులుగా కన్నాల, పెద్దనపల్లి, బుగ్గగూడెం, అంకుశం, చౌటపల్లి గ్రామపంచాయతీల పరిధిలో సంచరిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా లక్షెట్టిపేట అటవీ రేంజ్ పరిధిలో మరో పెద్దపులి సంచరిస్తోంది. నెల రోజులుగా ఈ అటవీ రేంజ్ పరిధిలో స్థిరనివాసం ఏర్పర్చుకుని ఉన్నట్లు సమాచారం. బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలో 43 వేల హెక్టార్లలో అటవీ విస్తీర్ణం విస్తరించి ఉండగా మంచిర్యాల డివిజన్ పరి ధిలో 65 వేల హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించింది. అటవీ ప్రాంతం విస్తారంగా ఉండడం, నీటి కుంటలు, శాఖాహార జంతువులు ఎక్కువగా ఉండడంతో పులుల రాక పెరిగిందని ఒక సీనియర్ అటవీ శాఖ అధికారి తెలిపారు. ఏదిఏమైనా మంచిర్యాల జి ల్లాకు పులుల వలసలు పెరిగిపోవడంతో వన్యప్రాణి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే పొంచి ఉన్న ప్రమాదాలను పసిగట్టి అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

## నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

బెజ్జూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రయోగ పరీక్షలు సోమవారం నుంచి పారదర్శకంగా నిర్వహించేందుకు ఇంటర్ విద్యాశాఖ సిద్ధమైంది. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిఘా నేత్రాల మధ్య ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించాలని ఇంటర్ బోర్డు ఆదేశాలు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 48జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో 11ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కాగా, 37ప్రభుత్వ సెక్టారులో పనిచేసే కళాశాలలు అంటే గురుకులాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు, ఐదు ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. జనరల్ విభాగం సెకండీయర్‌లో 1,920 మంది విద్యార్థులు, వొకేషనల్ విభాగం మొదటి సంవత్సరంలో 761మంది, సెకండ్ ఇయర్‌లో 769మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరు కానున్నారు. జిల్లాలో పరీక్షల నిర్వహణకు 23కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంటర్ బోర్డు నిర్ణయంతో సెకండ్ ఇయర్‌లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు కీలకంగా మారనున్నాయి. ఇక వొకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్స్‌పై బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 3నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 17వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు బోర్డు ఇప్పటికే షెడ్యూల్ సైతం విడుదల చేసింది. ప్రతిరోజు రెండు సెషన్లలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు

# ఏళ్లుగా ఎదురుచూపులు

● పరిష్కారం కాని మారు పేర్లు, అలియాస్, విజిలెన్స్ విచారణ సమస్య ● నేడు 'చలో కొత్తగూడెం'



సీఎంకు పోస్టు కార్డులు పంపుతున్న బాధితులు(ఫైల్)

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం కోసం ఆ కుటుంబాలకు చెందిన వారసులు గత 15 ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడమే తప్ప పరిష్కారానికి యూనియన్లు, పార్టీలు ప్రయత్నించడం లేదు. కొందరు బాధితులకు వయస్సు దాటి పోతుండగా, మరికొందరు ఆవేదనతో అనారోగ్యం పాలవు తున్నారు. తమ పిల్లలకు ఉద్యోగం ఎప్పుడు వస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో సోమవారం నిర్వహించనున్న చలో కొత్తగూడెం కార్యక్రమానికి బాధితులు తరలివెళ్లనున్నారు.

### నిరక్షరాస్యతతోనే సమస్య

సింగరేణిలో గతంలో ఎంతో మంది నిరక్షరాస్యులు ఉద్యోగాలు పొందారు. వీరిలో చాలామటుకు నిరక్షరాస్యులు కావడంతో ఉపాధికల్పనా కార్యాలయం ద్వారా జారీ అయిన కార్డుల్లో వయస్సు ఎక్కువ, తక్కువగా పడింది. కొందరి పేర్లు తప్పుగా పడ్డాయి. అయితే ఈ విషయాలు ఏమీ తెలియని వారు ఉద్యోగాలు చేశారు. కాగా పాతకాలం ఉద్యోగుల్లో చాలా మందికి గ్రామీణ ప్రాంతాల్లో వ్యవహారికంలో ఒక పేరు, రికార్డుల్లో ఒక పేరు ఉంది. ఉద్యోగాలు పొంది 30, 40 ఏళ్ల పాటు పనిచేశారు. వారు అన్‌ఫిట్ అయి తమ వారసులకు ఉద్యోగాలు ఇప్పించాలనేసరికి ఈ అలియాస్ సమస్య తెరపైకి వచ్చింది. ఉద్యోగులు ఒక్కొక్కరికి రెండేసి పేర్లు ఉన్నాయని సింగరేణి యాజమాన్యం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. నివేదికలు యాజమాన్యానికి అందినప్పటికీ ఉద్యోగం ఇవ్వాలా, వద్దా అనే విషయంపై ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదు.



నిరసన తెలియజేస్తున్న బాధితులు(ఫైల్)

### సుమారు 500 మంది..

అలియాస్, విజిలెన్స్ విచారణ ఉద్యోగాలకు నోచుకోని బాధితులు సుమారు 500 మంది ఉన్నట్లు తెలుస్తోంది. చిన్న, చిన్న కారణాలతో సింగరేణి విజిలెన్స్ విభాగం నివేదిక సమర్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా తమకు ఉద్యోగ వయస్సు దాటిపోతోందని, ఈ ఉద్యోగం వస్తుందని ఇతర ఉద్యోగాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగం రాక, కుటుంబాలను సాదుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక వారి తల్లిదండ్రుల బాధైతే చెప్పనలవి కాదు. తమ పిల్లలకు ఉద్యోగాలు రాకపోవడంతో అప్పులపాలవుతున్నారని, తాము 30, 40 ఏళ్ల సింగరేణికి సేవ చేస్తే ఇదేనా ఇచ్చే గౌరవం అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే ఆవేదనతో మంచం పడుతున్నారు.

### గతంలో హామీ ఇచ్చినా..

అలియాస్, విజిలెన్స్ బాధితుల సమస్య ఎన్నికల హామీగానే మిగిలిపోతోంది. ప్రతి గుర్తింపు సంఘం ఎన్నికలు, సాధారణ ఎన్నికల సందర్భంగా సింగరేణి సంస్థలో పనిచేసే కార్మికులకు అలియాస్ పేరు మార్పిడి విషయంపై న్యాయం చేస్తామని హామీలు గుప్పిస్తున్నారు. విజయం సాధించగానే ఆ విషయం మర్చిపోతున్నారు. గత ఎన్నికల సందర్భంగా సైతం ఇదే హామీ ఇచ్చినా పరిష్కారం చూపలేదు.

### మూడు రోజులు సమ్మె..

కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో 2021 డిసెంబర్‌లో మూడు రోజుల పాటు సమ్మె చేశారు. ఈ సందర్భంగా జేఏసీ, సింగరేణి సంస్థ నడుమ ఒప్పందం కుదిరింది. కార్మికుల పిల్లలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 40 ఏళ్ల వయస్సు వరకు ఉద్యోగం ఇవ్వాలని, మారుపేర్ల విషయంలో ఇబ్బందులకు గురి చేయవద్దని సంస్థకు విన్నవించారు. మారుపేర్లు మార్చుకునేందుకు తహశీల్దార్ కార్యాలయం, కోర్టు ద్వారా సర్టిఫికెట్ తీసుకొస్తే అంగీకరిస్తామని యాజమాన్యం చెప్పినా అమలులో మాత్రం ముందుకు సాగడం లేదు.

# జోరుగా అక్రమ వెంచర్లు

- నిబంధనలు పట్టించుకోని రియల్టర్లు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన వెంచర్

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రియల్టర్లు అక్రమంగా వెంచర్లు చేస్తూ సొమ్ము చేసుకుం టున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంచర్లు చేయాల్సి ఉండగా వీటిని పట్టించుకోకుండా ఇష్టారా జ్యంగాలే అవుట్‌లు లేని వెంచర్లు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాలి్సన ఆదాయానికి గండి పడుతోంది. ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి కూడా బ్యాంకు రుణాలు, ఇతరాత్ర సర్టిఫికెట్లు అవసరం ఉన్న వారికి ఇబ్బందులు తలెత్తనున్నాయి.

### డీటీసీసీ అనుమతి..

స్థిరాస్తి వ్యాపారం చేసే వారు భూముల్లో ఏర్పాటు చేసే వెంచర్ల కోసం ప్రధానంగా డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రి ప్లానింగ్(డీటీసీపీ) అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇందుకు భూమికి సంబంధించిన పట్టా, టైటిల్ డీడ్, ఈసీ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం సుమారు 10 ఎకరాల్లో వెంచర్ వేస్తే అందులో 10శాతం మున్సిపాలిటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయాలి. ఈ లెక్కన చూస్తూ 40 గుంటల స్థలాన్ని మున్సిపాలిటీకి ఇవ్వాలి. ఒక ఎకరంలో 8 ప్లాట్ల మేర తీయాల్సి ఉంటుంది. అలాగే రోడ్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. వీటితో పాటు డ్రైనేజీ వ్యవస్థ కోసం మ్యాప్‌లో చూపించాల్సి ఉంటుంది. అలాగే పిల్లల కోసం ప్లే గ్రౌండు కూడా ఏర్పాటు చేయాలి. వ్యవ సాయ భూమిని రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లుగా మార్చాలంటే కూడా కన్వర్షన్ సర్టిఫికెట్ కూడా అవసరం ఉంటుంది.

### ఇటీవల పుంజుకున్న వ్యాపారం..

జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం పుంజుకుంది. దీన్ని అనుకూలంగా మార్చుకొని కొంత మంది రియల్టర్లు రోడ్డు సమీపంలో ఉన్న స్థలాలను రైతుల వద్ద తీసుకొని వెంచర్లు చేస్తున్నారు. అనుమతులు లేకుండానే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ నియోజకవర్గాల్లో ఈ దందా ఎక్కువగా చేస్తున్నారు. ఆసిఫాబాద్-కాగజ్‌నగర్‌కు వస్తున్న ప్రధాన రోడ్డుపైనే నిబంధనలు పట్టించుకోకుండా వెంచర్లు చేస్తున్నారు. నిత్యం అధికారులు చూస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు. అలాగే ఏజెన్సీ ఏరియాలో కూడా అక్రమ వెంచర్లు చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి అక్రమ వెంచర్లపై నిఘా పెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### అక్రమ వెంచర్లపై చర్యలు..

నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా వెంచర్లు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఫిర్యాదులు చేసిన వాటిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. అనుమతి లేకుండా వెంచ ర్లలో ప్లాట్లను ప్రజలు కొనుగోలు చేయొద్దు.

- కిరణ్, తహసీల్దార్, కాగజ్‌నగర్

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): దాడి ఘటనలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. బెల్లంపల్లికి చెందిన ఎండీ ఉబేద్ (28) కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీ నగర్‌లోని తన అత్తింటికి జనవరి 23న వచ్చాడు. అతడిపై బావమరుదులు సైఫ్ అలీ, నవాజ్ దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలైన అతడిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.

## ఆలయంలో దొంగతనం

జైపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం తెల్లవారు జామున దొంగతనం జరిగినట్లు ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఉదయం గుడికి వచ్చిన పూజారీ గుడి తాళాలు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గుడి వద్దకు చేరుకుని దేవాలయంలో ఉన్న హుండీని, రెండు వెండి పగలు, పార్వతి అమ్మవారిపై ఉన్న రెండు బంగారు పుస్తెలు దొంగతనం జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

## నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్..!

(3వ పేజీ తరువాయి)

సీసీ కెమెరాల ఏర్పాటుకు సిద్ధం కావడంతో యాజమాన్యాలు ఒకింత నిరసన వ్యక్తం చేశాయి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయవద్దని, సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి తీరు సరిగా లేదని, ఆయనను బోర్డు నుంచి తప్పించాలని, లేకుంటే బోర్డు పరీక్షల కోసం తమ కళాశాలల్లో పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు సహకరించబోమని సూచించారు. దీంతో పునరాలోచనలో పడ్డ ప్రభుత్వం సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రైవేటు కళాశాలలకు మినహాయింపునిచ్చింది.

### ఇంటర్ బోర్డే పర్యవేక్షిస్తుంది..

**అంజయ్య, డీఐఈవో మంచిర్యాల**

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలపై ఈసారి బోర్డు అధికారులు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కళాశాల్లోని ల్యాబ్స్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయింది. ప్రతీ సీసీ కెమెరాపై బోర్డు ఉన్నతా ధికారుల నిఘా ఉంటుంది. ఉన్నతాధి కారుల ఆదేశాలను ప్రతీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాటించాలి.

## కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక బడ్జెట్




నర్సాపూర్ గ్రామంలో నిరసన తెలుపుతున్న నాయకులు

తాండూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు దాగం రాజారాం అన్నారు. ఆదివారం మంలంలోని నర్సాపూర్ గ్రామంలో సీపీఐ, ఏఐకేఎంఎస్, ఏఐఏడబ్ల్యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన గత బడ్జెట్ కంటే సుమారు 3 లక్షల కోట్లు ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించినా జీడీపీ లోటు 4.4 శాతంగా చూపడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నానయ్య, రాజయ్య, బాదిరావు, శ్యాంరావు, జంగు, ప్రభాకర్, బాజీరావు, భీంరావు, లచ్చు, జలపతిరావు, అనిల్, అర్జుబాయి, జంగుబాయి, లింగుబాయి,ప్రమీలబాయి, లక్ష్మీ పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందించాలి




నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

దండేపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో నాణ్యమైన విద్యను అందించాలని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి, జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ మహమ్మద్ అసాదుల్లా షరీఫ్ అన్నారు. దండేపల్లి మండలం మ్యాదరిపేటలో బ్రిలియంట్ కిడ్జీ స్కూల్ 3వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమానికి న్యాయమూర్తి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కుంటేనే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని, ఆ దిశగా పోటీతత్వంతో చదువుకోవాలన్నారు. మొబైల్‌ఫోన్ లకు దూరంగా ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల వ్యవస్థాక చైర్మన్లు సిరిపురం సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు డిజటల్ విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపకులు సిరిపురం చరత్‌చంద్ర, స్కూల్ ప్రిన్సిపల్ మల్లేష్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ తుల సిరామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మగ్గం వర్క్‌పై మహిళల ఆసక్తి





మందమర్రిలో మగ్గం వర్క్ నేర్చుకుంటున్న మహిళలు

### స్వయం ఉపాధి...



మహిళలకు మగ్గం వర్క్ మంచి ఉపాధి. ఆయా డిజైన్‌లతో బ్లౌజులకు, సారీలకు వర్క్ చేయడం ద్వారా డబ్బులు సంపాదించుకోవచ్చు. కుటుంబాలకు వారే అండగా కూడా ఉండవచ్చు. మందమర్రి లో ఆయా శిక్షణ కోర్సులు పూర్తి చేసిన దాదాపు 15 వందల మందికి పైగా ఉంటారు. ప్రతీ సంవత్సరం ఆయా కోర్సులకు సంబంధించి మూడు నెలలు ఉచిత శిక్షణ అందిస్తున్నాం.

**- స్వరూపరాణి దేవేందర్, సేవా సమితి అధ్యక్షురాలు**

- శిక్షణ ఇస్తున్న సింగరేణి సేవా సమితి
- ఆర్థిక ప్రగతి సాధిస్తున్న మహిళలు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మగ్గం వర్క్‌పై మహిళలు మొగ్గు చూపుతున్నారు. సింగరేణి సంస్థ అనుబంధ సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మందమర్రి ఏరియాలో మహిళ సాధికారత, ఆర్థిక ప్రగతి కోసం అనేక శిక్షణ తరగతులు సింగరేణి వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ఈ శిక్షణ ద్వారా అనేక మంది మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా మగ్గం, టైలరింగ్, పేపర్ బ్యాగులు, అల్లికలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. మూడు నెలల పాటు వారికి శిక్షణ ఇచ్చి ఒక్కో శిక్షకుడికి ప్రత్యేకంగా యాజమాన్యమే పది వేల వేతనం చెల్లిస్తోంది. దీంతో మహిళలు వారి కాళ్లపై వారు నిలబడుతూ ఆర్థిక ప్రగతితో పాటు కుటుంబానికి మూల స్థంభాలుగా నిలుస్తున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా మహిళలు పెద్ద సంఖ్యలో నేర్చుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో మగ్గంపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. కేవలం మందమర్రి ఏరియాలో మగ్గం వర్క్స్ ఉన్న చీరలు ప్రాచుర్యం పొందడంతో ఈ కోర్సులను యాజమాన్యం ప్రవేశపెట్టింది.

### మూడేళ్లలో 1500 మందికి పైగా శిక్షణ..

మందమర్రిలోని యోగా సెంటర్‌తో పాటు రామకృష్ణాపూర్ సూపర్ బజార్, సోమ గూడెం భరత్ కాలనీలో శిక్షణ ఇస్తున్నారు. గడిచిన మూడు సంవత్సరాల్లో దాదాపు 1500 మందికి పైగా శిక్షణ పొంది నైపుణ్యాన్ని సాధించారు. చాలా మంది నివాసాలతో పాటు కాలనీల వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదుగుతున్నారు. వివాహాలతో పాటు ఇతర శుభకార్యాలకు ఒక్కో బ్లౌజ్‌తో పాటు సారీలకు పది నుంచి 20 వేలకు పైగానే డబ్బులు సంపాదిస్తున్నారు. యువతులు కూడా షాపులను ఏర్పాటు చేసి వారి వద్ద నలుగురిని సహాయకులను పెట్టుకొని వారికి వేతనాలు కూడా చెల్లిస్తున్నారు. ఒంటరి మహిళలకు ఇది మంచి ఉపాధిగా మారింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం సాధించే మార్కెట్‌గా మగ్గం వర్క్స్ మారిపోయింది. మగ్గం వర్క్ షాపులు కూడా ఎక్కువగా వెలిశాయంటే మార్కెట్‌లో ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. సేవా సమితి ద్వారా శిక్షణ పొంది షాపులు ఏర్పాటు చేసిన వారు ఇతరులకు సైతం శిక్షణ అందిస్తూ పలువురిని తయారు చేస్తున్నారు. సింగరేణి యాజమాన్యం సహకారంతో సేవా సమితి ప్రవేశ పెట్టిన పలు కోర్సుల్లో మగ్గం వర్క్ మంచి ఫలితాలిస్తూ మహిళల అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తూ వారి జీవి తాల్లో వెలుగులు నింపుతోంది. మందమర్రికి సంబం దించి సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు స్వరూ పరాణి దేవేందర్ పర్యవేక్షించడంతో పాటు వారిని ప్రత్యేక్షంగా, పరోక్షంగా వెన్నుతట్టి ప్రోత్సహించడం విశేషం.

### మగ్గం వర్క్‌తో మంచి లాభాలు



సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి న మగ్గం వర్క్‌తో మంచి లాభాలున్నాయి. మార్కె ట్‌లో ప్రస్తుతం మగ్గం వర్క్‌దే పైచే యిగా ఉంది. వి వాహాలతో పాటు ఇతర శుభకార్యాలకు డబ్బులు ఎక్కువైనా దుస్తులపై మగ్గం వర్క్ చేయించు కుంటున్నారు. శిక్షణ పూర్తి కావస్తుంది. వెంటనే షాపును ఏర్పాటు చేస్తా

**- కావ్యశ్రీ**

### సేవా సమితి ప్రోత్సాహం మరువలేనిది..



సింగరేణి సేవా సమితి ప్రోత్సాహం మరువలేనిది. మూడు నెలల పాటు వృత్తి శిక్షణలో మగ్గం వర్క్ శిక్షణ తీసుకుంటున్నా. శిక్షణ అనంతరం షాప ఏ ర్పాటు చేస్తా. దీనిని దృష్టిలో పెట్టుకొని వర్క్‌పై ఆ సక్తి చూపాను, శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు.

**- పూజిత**

### మగ్గం మంచి ఉపాధి..



మగ్గం వర్క్ అనేది మంచి స్వయం ఉపాధి. ఎక్కడికి వెళ్లినా మగ్గం వర్క్ షాపులే ఎక్కువగా వెలుస్తున్నాయి. చిన్న పెద్ద తేడా లేకుండా మగ్గం వేయించుకుంటున్నారు. వయసుతో సంబంధం లేకుం డా ఆసక్తి చూపుతున్నారు. శిక్షణ పూర్తయిన వెంట నే షాపు పెట్టుకుంటాను.

**- మేఘన**

## పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

**ఎంఈవో కృష్ణమూర్తి**



భీమిని, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థు లపై ప్రత్యేక శ్రద్ధ వహించి వంద శాతం ఉ త్తీర్ణతే లక్ష్యంగా ముందు కెళ్తున్నామని ఎంఈవో కృష్ణమూర్తి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ఆంధ్రజ్యోతి :** పదవతరగతి విద్యా ర్థుల పట్ల ఎలాంటి శ్రద్ధ తీసుకుంటు న్నారు. మండలంలో ఎంత మంది ఉన్నారు ?

**ఎంఈవో :** విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు ఉదయం 8.15 నుంచి 9.15 వరకు, సాయంత్రం 4.15 నుంచి 5.15 వరకు నిర్వహి స్తున్నాం. చదువుల్లో వెనుక బడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఒక్కొక్క వి ద్యార్థికి ఉపాధ్యాయుడికి దత్తత ఇచాం. మండలంలో నాలుగు ఉన్నత పాఠశాలల్లో మొత్తం 95 మంది పదవ తరగతి విద్యార్థులు ఉన్నారు.

**ఆంధ్రజ్యోతి :** మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా. ఏజెన్సీలకు జీతాలు చెల్లించారా ?

**ఎంఈవో :** మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. మెనూ ప్రకారం అందించకుంటే ఏజెన్సీ నిర్వాహకు లను తొలగిస్తాం. మధ్యా హ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులకు డిసెంబరు వరకు వారి ఖాతాల్లో జమ చేశాము. మిగతా డబ్బులు త్వరలోనే చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి :** మండలంలో ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ?

**ఎంఈవో :** పెద్దతిమ్మాపూర్, చిన్నతిమ్మాపూర్, తంగళ్లపల్లి, వీగాం, ఆరెగూడెం ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. త్వరలోనే ఖాళీల భర్తీ అవుతాయి. యాపాఠశాలలో ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటుంన్నాము.

# అదుపు తప్పితే అంతే సంగతులు

**ప్రమాదకరంగా ఉన్న కడెం కెనాల్ సైడ్‌వాల్స్**

లక్షెట్టిపేట, ఫిబ్రవరి, 2 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని సీఎస్ఐ వెళ్లే దారిలో ప్రమాదం పొంచి ఉంది. కాస్త ఆదమరిస్తే ఇక అంతే సంగతి అన్నట్టుగా మారింది ప్రధాన రహదారి. ఆరు నెలల నుంచి ఇలానే ఉన్నా ఏ అధికారి పట్టించుకోవడం లేదు. చర్చికి కూతవేటు దూరంలో ఉన్న కడెం కె నాల్ సైడ్‌వాల్స్ రెండు కూలిపోయాయి. నిత్యం ఈదారిపై వందల సంఖ్యలో వాహనాలు వస్తూ పోతూ ఉంటాయి. రాత్రి సమ యంలో కూడా ఈదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. నిత్యం ఈదారి గుండా తిరిగే వాహనదారులు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా సార్లు సంబంధిత అధికారులకు, పాలకులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈరహదారిపై ఎవరైనా కొత్తవాళ్లు వస్తే మాత్రం ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏలాంటి ప్రమాదాలు జరుగకముందే బ్రిడ్జికి ఇరువైపుల సైడ్ వాల్స్ నిర్మించాలని స్థానికులు కోరుకుంటున్నారు.



సైడ్‌వాల్స్ లేని సీఎస్ఐ రోడ్డు కెనాల్

### మాజీ చైర్మన్‌కు ఘన సన్మానం

నస్పూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణును శాలువాలతో ఘనంగా సన్మానించారు. నస్పూర్ అభివృద్ధి కృషి చేస్తానన్నారు. మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోసిక మనోజ్ కుమార్, నాయకులు శైలజా, రామస్వామి, శ్రీధర్, లింగయ్య, రమేష్, వెంకటస్వామి, సతీష్ పాల్గొన్నారు.

### మాజీ వార్డు సభ్యుడికి ఘన సన్మానం

నస్పూర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నస్పూర్ మున్సిపాలిటీలో 14వ వార్డు సభ్యుడిగా 5 ఏళ్ల పాటు పనిచేసిన కేడిక ప్రకాష్ రెడ్డిని నస్పూర్‌రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. రెడ్డి సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు మోతె రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాకాల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేడిక ప్రకాష్ రెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు అనుమాండ్ల వెంకట్‌రెడ్డి, సలహాదారు సురేందర్‌రెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### కార్యవర్గం ఏర్పాటు

లక్షెట్టిపేట, ఫిబ్రవరి, 2(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండల తిమ్మాపూర్ గ్రామ ఆల్‌ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక కమిటీని నియమించినట్లు ఆసం ఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరుగు తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఆవునూరి శేఖర్, ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, హరీంద్ర, ప్రధానకార్యదర్శిగా మాలెం శుభాష్, కోశాధికారిగా ఆత్రం విశ్వనాథ్‌లను నియమించారు. కార్యదర్శులుగా లింగంపల్లి రవితేజ, సత్తయ్య, భూమేష్, సాయికుమార్, కమలాకర్, లక్ష్మన్, వంశీకృష్ణ, మల్లేష్, కిరణ్‌ను నియమించారు.

### బీసీ సభకు తరలిన నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని ఆర్ట్స్ కాలేజీలో ఆదివారం జరిగిన బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు జిల్లా బీసీ నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. నాయకులు మనోహర్, శ్రీనివాస్, రాజన్న యాదవ్, గణేష్, మల్లేష్, నరేష్, బాపు, రాజేష్, చంద్రకాంత్, లతీఫ్, భీమ్ సేన్, రాజన్న తదితరులు తరలి వెళ్లారు.

### పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ నెల 4లోగా పరీక్ష ఫీజును చెల్లించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, కో ఆర్డినేటర్ డాక్టర్ ఏకాంబరంలు ఒక ప్రకటనలో తెలిపారు. 1, 3, 5 సెమిష్టర్‌లకు సంబధించి ఇది వరకే పరీక్ష ఫీజు తేదీని ప్రకటించగా ఇటీవల ముగియడంతో తాజాగా ఈ నెల 4 వరకు గడువు తేదీని పొడగించామన్నారు. విద్యార్థులు గమనించి పరీక్ష ఫీజు సకాలంలో చెల్లించాలన్నారు.

### మహాభజన కార్యక్రమం

కన్నెపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లారం పోచమ్మ ఆలయం సన్నిధిలో ఆదివారం భజన మండలి సంఘం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి వెంకటేష్ చారి ఆధ్వర్యంలో మహాభజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోని అన్ని మండలాల నుంచి భజన మండలి సభ్యులు హాజరై పోచమ్మ తల్లికి ప్ర త్యేక పూజలు చేశారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు దత్తాత్రేయాచారి, ప్రధాన కార్యదర్శి రమేష్‌చారి, మండలి సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు తాగు నీటి కష్టాలు

**పాలిటెక్నిక్ కళాశాలలో పని చేయని వాటర్ ప్లాంటు**

**పట్టించుకోని ఉపాధ్యాయులు, అధికారులు**

బెల్లంపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న ఒకే ఒక పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తాగు నీటికి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ కళాశాలలో వందల మంది విద్యార్థులు చదువుతున్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటు ఏడు నెలలుగా పని చేయకపోవడంతో విద్యార్థులకు శుద్ధ నీరు అందడం లేదు. చాలా మంది ఇళ్ల నుంచే వాటర్ బాటిళ్లను తెచ్చుకుంటూ మరికొంత మంది విద్యార్థులు వాటర్ బాటిల్స్ కొనుగోలు చేస్తూ దాహార్తి తీర్చుకుంటున్నారు. రానున్న వేసవి దృష్ట్యా విద్యార్థులకు తాగు నీటి ఇబ్బందులు మరింత పెరగనున్నాయి. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి తాగు నీటి కష్టాలను తీర్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

### ఏడు నెలలుగా మరమ్మతులకు నోచుకోని వైనం..

పాలిటెక్నిక్ కళాశాలలో 540 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. ఈ కళాశాలలో విద్యార్థులకు శుద్ధమైన వాటర్ అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంటు ఏడు నెలల క్రితం పాడైంది. అప్పటి నుంచి విద్యార్థులకు తాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. కళాశాలకు కాగజ్‌నగర్, శ్రీరాంపూర్, మంచిర్యాల, లక్షెట్టిపేట, గోదావరిఖని వం టి ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. తాగునీటి సమస్యను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



కళాశాలలో మూలన పడ్డ వాటర్ ప్లాంటు

### సమస్య పరిష్కారిస్తాం

**దేవేందర్, పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, బెల్లంపల్లి**

పాలిటెక్నిక్ కళాశాలలోని ఆర్వో ప్లాంటు చెడిపోవడంతో కొద్ది రోజుల క్రితం మరమ్మతులు చేయించాం. అయినప్పటికీ ప్లాంటు పనిచేయడం లేదు. తాగునీటి సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే ప్లాంటు బాగు చేయించి విద్యార్థుల తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

# పంట చేనుకు..చీర కట్టు

**జంతువులు, పక్షులను చెదరగొట్టేందుకు రైతుల ప్రయత్నం**

దండేపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల బెడద నుంచి మొక్కజొన్న పంటను రక్షించుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటల రక్షణ కోసం పాత చీరలను కంచెగా కట్టి కాపాడుకుంటున్నారు. రైతన్నలు వలకు వేలు పెట్టుబడి పెట్టి కష్టపడి పండించుకున్న పంటలపై పక్షులు, జంతువులు దాడి చేసి తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంటలు ఎలా కాపాడుకోవాలో తెలియక తికమక పడుతున్నారు. చివరకు మొక్కజొన్న పంటల చుట్టూ రంగు రంగుల చీరలను కట్టి కంచెగా ఏర్పాటు చేసుకుని పంటలను రక్షించుకుంటున్నారు. దండేపల్లి మండలంలోని మేదరిపేట నుంచి ద్వారక వేళ్లే రింగ్ రోడ్డు మదాపూర్ గ్రామ శివారులోని ఓ రైతు సాగు చేసిన మొక్కజొన్న పంట క్షేత్రం వద్ద రంగు రంగుల చీరలను ఇలా కట్టుకున్నారు అన్నదాతలు. వీటిన చూసిన పలువురు అన్నదాతలు ఐడియా బాగుందంటూ తాము కూడా ఇలానే చీరలు కట్టుకుంటామని అనుకుంటున్నారు.



మదాపూర్‌లో శివారులో మొక్కజొన్న పంట చుట్టూ కట్టిన రంగు రంగుల చీరలు

## కన్నాల అడవిలోనే పెద్దపులి

**భయాందోళనలో ప్రజలు**

బెల్లంపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కన్నాల అటవీ ప్రాంతంలోనే పెద్దపులి తిష్టవేసి ఉన్నట్లు సమాచారం. నాలుగు రోజుల క్రితం కన్నాల అటవీ ప్రాంతంతో పాటు బుగ్గగూడెం, లక్ష్మీపురం, బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయం సమీప ప్రాంతాల్లో పెద్దపులి సంచరించింది. ఆదివారం కన్నాల అటవీ శివారు ప్రాంతంలో అధికారులు పెద్దపులి అడుగులను గుర్తించారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు సాయంత్రం నాలుగు దాటితే ఇంట్లో నుంచి బయటకు వెళ్లడం లేదు. అలాగే అటవీ శాఖ అధికారులు సైతం ప్రజలు కన్నాల అటవీ పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా రహదారిని మూసివేశారు. ఎప్పటికప్పుడు అధికారులు పులి కదలికలను గుర్తిస్తున్నారు. నాలుగు రోజులుగా ఒకే ప్రాంతంలో పులి ఉంటుండడంతో వేటగాళ్లతో పులికి హానీ కలుగుతుందనే ఉద్దేశ్యంతో అటవీ శాఖ అధికారులు రక్షణ చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడమే కాకుండా బీట్ అధికారులను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. బుగ్గ పరిసర ప్రాంతంలో పెద్దపులి కదలికలు ఉండడంతో బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు ఎవరూ వెళ్లడం లేదు. వరుసగా రెండు రోజులు బుగ్గ దేవాలయానికి అర్చకులు తాళం వేసి వెళ్లిపోయారు.

### సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

**చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి**

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో మాలలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇది సరైంది కాదని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సంగారెడ్డిలో జరిగిన మాల ఉద్యోగ సంఘం సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దళితులపై కుల వివక్ష ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తాము ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. సుప్రీంకోర్టును తీర్పును సరిగ్గా అర్థం చేసుకోవడం లేదని, పూర్తిగా పరిశీలించాలన్నారు. మందకృష్ణ మాదిగలను మభ్య పెడుతున్నారని, మాలలంతా ఐక్యంగా ఉండాలన్నారు. మాలల అభివృద్ధి కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నానన్నారు.

### ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయానికి నిదర్శనం

కాసిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయానికి నిదర్శనమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్ర సతీష్ మాదిగ అన్నారు. ఆదివారం దేవాపూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం అనేక పోరాటాలు జరిగాయన్నారు. ఈ నెల 7న తలపెట్టిన లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు, కార్యక్రమాన్ని మాదిగలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్వల శరత్ మాదిగ, వడ్లూరి మల్లేష్, రామిళ్ల కళ్యాణ్, కిష్టయ్య, పంగ లచ్చయ్య పాల్గొన్నారు.



## రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

**రాజేందర్, కోటపల్లి ఎస్ఐ**



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ఆంధ్రజ్యోతి :** రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

**ఎస్ఐ :** రోడ్డు భద్రత పై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులకు, యువతకు, ఆటోలు తదితర వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. సదస్సులు, ఏర్పాటు చేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి :** శాంతి భద్రతల పరిరక్షణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

**ఎస్ఐ :** శాంతి భద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. అ సాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేం దుకు సీసీ కెమె రాలను ఏర్పాటు చేశాం.

**ఆంధ్రజ్యోతి :** గుడుంబా, కోడి పందా లు తదితర వాటిపై తీసుకుంటున్న చర్య లు ఏమిటీ?

**ఎస్ఐ :** గ్రామాల్లో గుడుంబా, కోడి పందాలు, పేకాట ఎవరు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటున్నాం. కేసులు నమోదు చేశాం.

**ఆంధ్రజ్యోతి :** రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణాలు ఏమిటి?

**ఎస్ఐ :** అతి వేగం, మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు చేపడుతున్నాం.

- కోటపల్లి (ఆంధ్రజ్యోతి)



# నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్..!

- జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- నేటి నుంచి 20 రోజులపాటు పరీక్షలు
- జిల్లాలో 39 కేంద్రాలు, ఏడు వేల మంది విద్యార్థులు
- ఏర్పాట్లు చేసిన అధికారులు

మంచిర్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను ఈసారి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా నిఘా నీడలో నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు ఏర్పాట్లు చేసింది. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 20 రోజుల పాటు జరిగే ఈ పరీక్షలపై నిఘాను పటిష్ఠం చేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా సీసీ కెమెరాల నిఘాలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఇటీవల జిల్లాలోని ఇంటర్ అధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లోని ప్రయోగశాలలు గల గదుల్లో సీసీ కెమెరాలను బిగించే పనిని హైదరాబాద్ లోని ఒక సంస్థకు అప్పగించింది. ఇందుకోసం ఒక్కో కళాశాలకు ప్రభుత్వం 12వేల రూపాయలు కేటాయించింది. ఆమేరకు జిల్లాలోగల కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కూడా పూర్తి కావచ్చింది.

**ఏడు వేల పైచిలుకు మంది విద్యార్థులు...**

ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 39 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్, 17 రెసిడెన్షియల్ కళాశాలలు, 12 ప్రైవేటు కళాశాలలు ఉండగా జనరల్, వొకేష నల్, బ్రిడ్జి కోర్సులు అభ్యసించే విద్యార్థులు 7 వేలపై చిలుకు మంది ఉన్నారు. కాగా ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం జిల్లాలోని అన్ని కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### ప్రతి కళాశాలకు రూ. 25 వేలు...

ప్రతీయేటా ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో విద్యార్థులకు ప్రయోగ పాఠాలు బోధించేందుకు ఆధ్యాపకులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం ఈ సారి ప్రతీ కళాశాలకు 25 వేల రూపాయలను గత నెలలో కేటాయించింది. ఆ మేరకు భౌతిక, రసా యన శాస్త్రాలు, జంతు, వృక్ష శాస్త్రాల ప్రయోగాల కోసం కావాల్సిన పరికరాలు, రసాయనాలను కళాశాలల్లో సమకూర్చారు. దీంతో నెల రోజుల నుంచి అధ్యాపకులు విద్యార్థులకు ప్రయోగ పాఠాలు బోధిస్తున్నారు. జిల్లాలో సుమారు 7వేల పైచిలుకు మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రశ్నా పత్రం ఏ రోజుకారోజు ప్రిన్సిపాల్ లాగిన్‌కు మెయిల్ ద్వారా రానుండగా, దాన్ని సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రింట్ తీసుకొని విద్యార్థులకు అందిస్తారు. అక్రమాల నిరోధానికి మునుపెన్నడూలేని విధంగా ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ నేపథ్యంలో పలు కళాశాలల యాజమాన్యాలు ఆగమేఘాల మీద సీసీ కెమెరాల బిగింపు, ప్రాక్టికల్స్‌కు సంబంధించిన పరికరాలు, రసాయనాలు తెప్పించారు.

### కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం...

జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసే సీసీ కెమె రాలను హైదరాబాద్‌లో గల ఇంటర్ బోర్డు కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేయనున్నారు. అక్కడ ఒక బృందం ఈ కెమెరాల ద్వారా పరీక్షలు జరుగుతున్న తీరును పర్యవేక్షించనుంది. ప్రాక్టికల్స్ నిర్వహించే గదుల్లో రెండేసి చొప్పున వీడియోతో పాటు వాయిస్ రికార్డింగ్‌తో కూడిన సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ అయ్యాయి.

### ప్రైవేట్ కళాశాలలకు మినహాయింపు...!

ప్రాక్టికల్ పరీక్షల్లో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. కేవలం 60 మార్కుల పరీక్ష కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం సమంజసం కాదని చెబుతున్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలోనే కళాశాలల్లో..

మిగతా 5లో..



మగ్గం వర్క్‌పై మహిళల ఆసక్తి...
- శిక్షణ ఇస్తున్న సింగరేణి సేవా సమితి
- ఆర్థిక ప్రగతి సాధిస్తున్న మహిళలు

5

పక్షుల విహారం.. ప్రకృతి పరవశం
- పెంచికలపేటరేంజ్‌లో బర్డ్ వాక్ ఫెస్టివల్

6



# పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి




సదస్సులో మాట్లాడుతున్న వామపక్ష పార్టీ ఐక్యవేదిక నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్ర భుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రాణహిత, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు, ఉ మ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని వామపక్ష పార్టీ ఐక్యవేదిక నాయకులు, తెలంగాణ జన సా ధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ పేర్కొన్నారు. ఆదివారం షాదిఖా నాలో నిర్వహించిన సదస్సులో నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆది లాబాద్ జిల్లాకు పాలకులు మారినా తీరని అన్యాయం జరుగుతోం దన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 23 లక్షల ఎకరాల సాగు భూమి ఉం టే కేవలం మూడున్నర లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరందుతోం దన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ వామపక్ష, ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు రామడుగు లక్ష్మణ్, లాల్‌కుమార్, పున్నం, గోపినాథ్, శ్రీనివాస్, నైనాల గోవర్ధన్, శ్రీనివాస్, మంగ, జ్యోతి, అరుణ, చంద్రశే ఖర్, శేఖర్, రైతులు పాల్గొన్నారు.



# సంఘాన్ని క్షేత్ర స్థాయిలో పటిష్టం చేయాలి

- సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్

నస్పూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి సంఘంను క్షేత్ర స్థాయి నుంచి పటిష్టం చేయాల్సినవసరం ఉందని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో సంఘం బలోపేతంకు క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయి కమిటీలను నియమించాలన్నారు. ప్రభుత్వాలు చట్టాలను అమలుచేసి ఆదుకోవాలన్నారు. తల్లిదండ్రుల, వయోధికుల పోషణ, సంక్షేమం చట్టం-2007 రూల్స్ 2011 కచ్చితంగా అమలు పర్చాలన్నారు. సీనియర్ సిటిజన్స్‌కోసం 5శాతం బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రతి మండలంలో, మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ డేకేర్ సెంటర్ ను ఏర్పాటు చేయాలన్నారు. బస్సు, రైలు ప్రయాణాలు ఉచితం చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధుల సంక్షేమం కొరకు ఏర్పాటు చేసిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మెంటనెన్స్ ట్రిబునల్స్, అప్పిలేట్ ట్రిబునల్స్ లో పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఉచిత వైద్యం సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు కనకయ్య, చిలువేరు సదానందం, రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, కలవేన సమ్మయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్



సూర్య భగవానుడు

# రేపు రథసప్తమి పర్వదినం

నస్పూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యుడికి ప్రీతికరమైన సూర్య జయంతిని రథసప్తమి పర్వదినంగా మాఘ శుద్ధ సప్తమి మంగళవారం జరుపుకోనున్నారు. ఈ రోజున రథ సప్తమి నోము ఆచరించడం శ్రేయస్కరమని శాస్త్రం చెబుతోంది. సంక్రాంతికి నోచు కోని, వీలుకాని వారు రథసప్తమి నాడు నోముకుంటారు. సూర్య నమస్కారాలు, నదీ స్నానాలు, అర్ఘ్యాదులు, ఉపవాసాలు పాటించ డం, సూర్యనారాయణుడు, త్రిమాతృకల పేరుతో వ్రతాచరణల వల్ల ఆరోగ్యం, వివాహసిద్ధి, ముత్తైదువలకు సకల శుభాలు కలుగుతాయి.

**● వ్రతం వెనుక ఇతిహాసం...**

ఓ రాజుకు గండాలతో కుమార్తె జన్మిస్తుంది. ఆమెను జ్యోతిష్కుడు పరిశీలించి పూర్వజన్మలో పాపాలు చేసిందని, పాప పరిహారం కోసం రథ సప్తమి వ్రతాన్ని చేయాలనుకున్నదని ఆకాస్త పుణ్యంతో రాకుమారిగా జన్మించిందని చెప్పాడు. నివారణ కోసం రాజు ఆమె చే రథసప్తమి నోము నోమింపజేస్తాడు. దీంతో మంచి రాకుమా రుడు భర్తగా లభిస్తాడు. అదే రథసప్తమి నోముగా స్థిర పడిందని చెబుతారు.

**● ఇలా ఆచరించాలి..**

రథ సప్తమికి ముందు రోజు నూనె లేని పదార్థాలను తీసుకోవాలి. రథ సప్తమి నాడు ఇంటి ముందు ముగ్గులు వేసి, ప్రమిదలను తలపై ధరించి నదీ తీరానికి వెళ్లి అందులో వదలాలి. జిల్లేడు ఆకులను తలపై, భుజాలపై పెట్టుకుని స్నానం చేయాలని, జప, హోమ, తర్పణాదులు, పితృ దేవతారాధనలు చేయాలని, క్షీరాన్నం నైవేద్యం పెట్టి భుజించాలనిశాస్త్రం చెబుతుంది. వెండి సప్తాశ్వరథంలో బంగారు సూర్య ప్రతిమను ఉంచి తామర పువ్వులతో అర్చించాలి. మహిళలు రథాన్ని, ప్రతిమను ముత్తైదువలకు దానం ఇచ్చి 12 అంశలతో కూడిన సూర్యునికి ప్రీతిగా 12రకాల పిండి వంటలతో వాయినాలివ్వాలి. 12మందిని సత్కరించి భోజనం పెట్టాలి. పసుపు కుంకుమలు, నోములు పంచి ఆలయాలను సంద ర్శించాలి. ముత్తైదువులు, బ్రాహ్మణులు, పెద్దల ఆశీస్సులను పొందాలి.

**● సూర్య నమస్కారం శ్రేయస్కరం...**



సూర్య భగవానుడు ప్రత్యక్ష దైవం. ప్రతి రోజు సూర్య నమ స్కా రం చేయడం మంచిది. రథసప్తమి సందర్భంగా నది స్నానం ఆచ రించి ప్రత్యేక పూజలు చేయాలి. పూజల కారణంగా దోషాలు తొలి గిపోయి నిర్విఘ్నంగా కార్యక్రమాలు సాగుతాయి. సూర్యభగవాను డిని నమ్మి పూజిస్తే శుభ ఫలితాలు చేకూరుతాయి.

- గంగారపు వంశీకృష్ణ శర్మ పూజారి- నస్పూర్ కాలనీ

మందమర్రి మున్సిపాలిటీని రద్దు చేసి..

## గ్రామపంచాయతీగా మార్చాలి




ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం నాయకులు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మున్సిపాలిటీ అనధికారికంగా కొనసాగుతుందని, అధికారికంగా కాదని ఊరు మందమర్రి పంచాయతీ ఎన్నికల సాధన సమితి నాయకులు పేర్కొన్నారు. ఊరు మందమర్రితో పాటు ఆదివాసీలు ఉన్న ప్రాంతాలను కలుపుకుని పంచాయతీగా ఏర్పాటు చేసుకుని ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఆదివారం ఎన్నికల సాధన సమితి నాయకులు, ఆదివాసీ నాయకపోడ్ సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్రీయ రహదారి పై ఓవర్ బ్రిడ్జి కింద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మందమర్రి అంతా ఏజెన్సీ ప్రాంతమని, 1/70 చట్టంలో మున్సిపాలిటీ ఉండదని తెలిపారు. దీనికి సంబంధించి కోర్టును ఆశ్రయించామని, తమకు అనుకూలంగా తీర్పు వస్తుందన్నారు. మున్సిపాలిటీతో గిరిజనులు నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్ది భార్గవ్, రాజేష్, పెద్ది రాజన్న, అరుణ్‌కుమార్, రాజు, గంట సత్యం, కొమ్ముల బాపు, రాజేష్, సత్యనారాయణ, రాజేశ్వరి, లలిత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## వర్గీకరణ తర్వాతే ఉద్యోగాలు బర్తీ చేయాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నారాయణ



నూతన అధ్యక్షులను సన్మానిస్తున్న సభ్యులు

లక్షెట్టిపేట, ఫిబ్రవరి, 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ సామాజిక వర్గంలో ఏబీసీడీ వర్గీకరణ తర్వాతనే ప్రభుత్వ ఉద్యోగాల బర్తీ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు చిప్పకుర్తి నారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ గెస్టుహౌస్‌లో నూతనంగా ఏర్పాటు అయిన అధ్యక్ష కార్యదర్శుల సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 7వ తారీకున హైదరాబాద్‌లో లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఇటీవల నూతనంగా ఎన్నికైన మండల, పట్టణ అధ్యక్ష కార్యదర్శులను శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవునూరి లచ్చన్న, ముల్కల్ల రంజిత్, వెల్పుల సత్యం, రవి, చాతరాజు శివశంకర్, రమేష్, అల్లంపల్లి రమేష్, రాజశేఖర్, ప్రసాద్, మధు, విక్రం, శివకుమార్ పాల్గొన్నారు.

## ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మధ్య తరగతి ప్రజలకు ఊరటను కలిగిస్తూ రూ. 12 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు కల్పించడాన్ని స్వాగతిస్తూ మంచిర్యాలలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమిరిశెట్టి రాజ్‌కుమార్, దుర్గం అశోక్, శ్రీదేవి, సతీష్ రావు, మల్లికార్జున్, అశోక్, రాజేష్, చిరంజీవి, శ్రీనివాస్, వెంకన్న, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

### లక్ష డప్పులు..వేల గొంతులు జయప్రదం చేయాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7న హైద్రాబాద్‌లో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే లక్ష డప్పులు వేలగొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ పట్టణాధ్యక్షుడు రామగిరి మహేష్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కార్యక్రమం పోస్టర్లను విడుదలచేసి మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జీ జిలకర శంకర్, సీనియర్ నాయకులు రత్నం ఐలయ్య, రాజేష్, నాయకులు పాల్గొన్నారు.